
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
శనివారం 8 ఫిబ్రవరి 2025

విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా... 7
- జిల్లెల్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 'వాటర్ బెల్స్'కు శ్రీకారం

ఉపాధి కార్మికుల బకాయిలు విడుదల చేయాలి
- మూడు నెలలుగా కార్మికుల అవస్థలు
- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు 8



తంగళ్లపల్లిలో పవర్‌బోర్

భగీరథ వచ్చినా.. తొలగని విద్యుత్ భారం



- బల్దియా, గ్రామ పంచాయతీల్లో బోరు బావులతో తాగునీటి సరఫరా
- జిల్లాలో స్థానిక సంస్థల్లో 1787 బోరుబావులు కనెక్షన్లు..
- ప్రతినెలా రూ.1.27కోట్లు విద్యుత్ బిల్లు..
- స్ట్రీట్‌లైట్లు, నీటి సరఫరా పాత బకాయిలు రూ.159.76 కోట్లు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మహిళలు ట్యాంకర్ల వద్దకు పరుగు లెత్తకుండా ఇంటి వద్దకే నీళ్లు అంటూ గత ప్రభుత్వ హయాంలో ఎంతో ఆర్భాటంగా... ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి నల్లాలు ఏర్పాటు చేశారు. కానీ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 260 గ్రామపంచాయతీలు, సిరిసిల్ల, వేములవాడ రెండు మున్సిపాలిటీలకు నీటి సరఫరాలో కరెంట్ భారం మోయలేని పరిస్థితి ఉంది. విద్యుత్ సరఫరా బకాయిలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న సందర్భాలు ఉన్నాయి. మరోవైపు మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి శుద్ధజలం అందించడం ఎలా ఉన్నా ఇప్పటికీ జిల్లాలో పవర్ బోర్‌ల ద్వారా అనేక ప్రాంతాల్లో నీటిని సరఫరా చేస్తూనే ఉన్నారు. నీటి సరఫరాకు సంబంధించిన విద్యుత్ బకాయిలతో మాత్రం సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం కూడా సతమతమవుతోంది.

● ప్రతి నెలా నీటి సరఫరా విద్యుత్ భారం రూ 1.27 కోట్లు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో 1787 విద్యుత్ కనెక్షన్ల ద్వారా నీటి సరఫరా కోసం ప్రతినెలా రూ1.27 కోట్లు కరెంట్ బిల్లు వస్తుంది. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘానికి ప్రభుత్వం నుంచి నీటి సరఫరా, స్ట్రీట్ లైట్లకు సంబంధించి పాత బకాయిలు 31 జూన్ 2020 నాటికి రూ.159.76 కోట్లు పేరుకు పోయాయి. అరకొర ఆదాయంతో కరెంట్, నీటి సరఫరా విద్యుత్ బిల్లులు కూడా సకాలంలో చెల్లించలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం విడుదల చేసే నిధులపైనే ఆధారపడుతు న్నారు. జిల్లాలోని అనేక గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి వినియోగం కంటే బోరుబావుల పైనే ఆధారపడుతున్న వారే ఎక్కువగా ఉన్నా రు. మిషన్ భగీరథ నీళ్లు తక్కువగా సరఫరా కావడం, దురద, ఇతర ఇబ్బందులు వస్తున్నాయని ప్రజలు...

మిగతా 8లో

● డిసెంబరులో గ్రామ పంచాయతీల్లో నీటి సరఫరా కరెంట్ బిల్లు

మండలం	కనెక్షన్లు	బిల్లు(లక్షల్లో)
సిరిసిల్ల	400	11.36
వేములవాడ పట్టణం	125	8.24
వేములవాడ అర్బన్	46	2.92
గంభీరావుపేట	60	13.51
కోనరావుపేట	168	13.42
బోయినపల్లి	196	10.78
ఎల్లారెడ్డిపేట	176	8.89
ముస్తాబాద్	138	10.52
చందుర్తి	52	3.90
ఇల్లంతకుంట	159	14.47
తంగళ్లపల్లి	135	13.01
వేములవాడ రూరల్	53	4.80
ఎల్లారెడ్డిపేట	206	10.06
రుద్రంగి	49	1.26
మొత్తం	1787	127.34

కోళ్లఫాంలను శానిటైజ్ చేసుకోవాలి

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : బ్రాయిలర్, లేయర్ కోళ్లు వైరస్ బారినపడి మృత్యు వాత పడుతున్న నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పౌల్ట్రీ రైతులు తమ కోళ్ల ఫాంలను శానిటైజ్ చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి కోరారు. కలెక్టరేట్‌లోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని పౌల్ట్రీ రైతులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో వైరస్ బారినపడి బ్రాయిలర్, లేయర్ కోళ్లు మృత్యువాత పడుతున్నాయని, దీనిపై రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఉన్న 97 బ్రాయిలర్, ఫార్మ్, 88లేయర్ పార్మ్‌లను పశుసంవర్ధక శాఖ అధికారులు పరిశీలించారన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా వైరస్ సోకలేదని గుర్తించారన్నారు. ముందుజాగ్రత్తగా పౌల్ట్రీ రైతులు షెడ్‌లను తరచూ శానిటైజ్ చేసుకోవాలని, దాణా సరఫరా చేసే వాహనాలు, కోళ్లను తరలించే వాహనాలు, కోడిగుడ్లను తీసుకొని వెళ్లే వాహనాలను సైతం శానిటైజ్ చేసుకున్న తరువాతనే షెడ్‌లోకి అనుమతించాలని సూచించారు. ప్రతి షెడ్ దగ్గర ఫుట్ బాత్‌లను ఏర్పాటుచేసుకోవాలన్నారు. చికెన్‌లో 88శాతం ప్రోటీన్ ఉంటుందని, త్వరగా జీర్ణం అవుతుందన్నారు. కోడి గుడ్డులో 13 గ్రాములు ప్రోటీన్ ఉంటుందని, ప్రతి మనిషి రోజుకు తన శరీరాన్ని బట్టి 50 కేజీల బాడీ వెయిట్ ఉన్న మనిషికి 50గ్రాములు, 70 కేజీలు ఉన్నవారికి 70 గ్రాముల ప్రోటీన్ అవసరం ఉంటుందన్నారు. ప్రజలు వైరస్ గురించి కోళ్ల మృత్యు వాతలపై వచ్చే వదంతులను నమ్మవద్దని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ అంజిరెడ్డి, పౌల్ట్రీ యాజమానులు పాల్గొన్నారు.

జ్ఞానయజ్ఞం కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్ హనుమాన్ దేవాలయంలో శుక్రవారం చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో జ్ఞానయజ్ఞం కరపత్రాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్మయ మిషన్ సిరిసిల్ల శాఖ అధ్యక్షుడు సజ్జనం శ్రీనివాస్ మాట్లాడారు. జ్ఞానయజ్ఞనంలో భాగంగా నిర్వహించే సప్తాహ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో చిన్మయమిషన్ ప్రధాన కార్యదర్శి నల్ల సత్యనారాయణ, దేవాలయం కమిటీ అధ్యక్షుడు ఆడెపు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి తాటిపాముల శ్రీనివాస్, నాయకులు లాకవత్ మోతిలాల్, మేర్గు మల్లేశం, దూడం నాగభూషణం పాల్గొన్నారు.

10న హైదరాబాద్‌లో మహా ధర్నా..

వేములవాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాదులో ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న ప్రజా సంఘాల మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామంచ అశోక్, కార్యదర్శి ముక్తి కాంత అశోక్ కోరారు. శుక్రవారం వారు వేములవాడలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా రైతు, ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని, బడ్జెట్‌ను నిరసిస్తూ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న మహాధర్నా కార్యక్రమానికి జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కాలువ పనులు ప్రారంభం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపట్ల బతుకమ్మ చెరువులోకి నీరు రావడానికి తాత్కాలికంగా కాలువ పనులను శుక్రవారం ప్రారంభించారు. భూగర్భజలాలు అడుగంటుతున్నాయని, బుతకమ్మ చెరువును అన్నపూర్ణ రిజర్వాయర్ నీటి ద్వారా నింపాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి రైతులు తీసుకెళ్లారు. తాత్కాలికంగా పైపులు వేయడం ద్వారా నీటిని సరఫరా చేయవచ్చని భావించిన అధికారులు పనులు చేపట్టారు. త్వరలోనే నీరు బతుకమ్మ చెరువుకు చేరుకుంటుందని నాయకులు పేర్కొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూంపల్లి రాఘవరెడ్డి, మాజీ ప్యాక్స్ చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, అనీల్, విజయ్, రాజేశం, మల్లేశంలతో పాటు రైతులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలి

వీర్నపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం బావ్ సింగ్‌నాయక్ తండాలో ఇన్‌చార్జి ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బానోతు లింబాద్రి ఉపాధిహామీ డబ్బులను దుర్వినియోగం చేశాడంటూ తండావాసులు ఎంపీడీవో అబ్దుల్ వాజిద్‌కు శుక్రవారం దరఖాస్తు అందించారు. లింబాద్రి భార్య, కుమారుడితో పాటు మరికొందరు విదేశాలకు వెళ్లిన వ్యక్తుల పైన పనులు చేసినట్లు హాజరు వేసి డబ్బులను వాడుకున్నట్లు అధికారులకు విన్నవించారు. నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపి రికవరీ చేసి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈవిషయంపై స్థానిక ఎంపీడీవోను వివరణ కోరగా దరఖాస్తును పరిశీలించి, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

డిగ్రీ కళాశాలలో నేషనల్ గర్ల్ చైల్డ్ డే..

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని శాత్రాజ్‌పల్లి తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో నేసనల్ గర్ల్ చైల్డ్ డే కార్యక్రమం జరిగింది. క్రియేటివిటీ వీక్ సందర్భంగా విద్యార్థినులకు శుక్రవారం గర్ల్స్ లీడ్ ద వే అనే అంశంపై ఆర్ట్, పోస్టర్ ప్రదర్శన చరిత్రలో మహిళా నాయకులపై నాటక పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె లావణ్య, వైస్ ప్రిన్సిపాల్ బి సుమలత, అకాడమిక్ కోఆర్డినేటర్ నిర్మల, స్టాఫ్ సెక్రెటరీ రజినీ, కల్చరల్ కమిటీ కోఆర్డినేటర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల వాహన తనిఖీలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట గ్రామశివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధానరహదారిపై ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పో లీసులు శుక్రవారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన ధ్రువీకరణ పత్రాలు, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి జరిమానాలు విధించారు.

సిరిసిల్ల బ్రాండ్‌తో వస్త్రాల ఉత్పత్తికి ప్రణాళిక

- టెక్స్‌టైల్, డెయిరీ రంగాల్లో ఎగుమతులకు కృషి
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల బ్రాండ్‌తో వస్త్రాలు ఉత్పత్తి చేసే ప్రణాళిక తయారుచేయాలని, డెయిరీ ఉత్పత్తులు, టెక్స్‌టైల్ రంగాల్లో ఎగుమతుల కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. శుక్రవారం జిల్లా స్థాయి ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి ఎగుమతులు చేయడానికి వీలుగా అవకాశం ఉన్న రెండు, మూడు ఉత్పత్తులను గుర్తించి, వాటిని ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. నాబార్డ్, ఎంఎస్ఎంఈలు జాతీయ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డుతో సమన్వయం చేసుకుంటూ పాల ఉత్పత్తులు, సిరిసిల్ల బ్రాండ్‌తో వస్త్రాల తయారీకి ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. సిరిసిల్ల జిల్లాలో యాక్టివ్‌గా ఉన్నా ఎఫ్‌పీవోలకు ఎక్కువగా మార్కెటింగ్ అందేలా చూడాలని సూచించారు. వస్త్ర పరిశ్రమ నుంచి ఎగుమతులు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి నివేదికలు అందించాలని అన్నారు. టెక్స్‌టైల్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడ ఎంతమేరకు డిమాండ్ ఉంది, ఏలాంటి వస్త్ర ఉత్పత్తులు ఎగుమతి చేయవచ్చు వంటి వివరాలను పరిశీలించాలని అన్నారు. చేనేత కార్మికులతో సమావేశాలు నిర్వహించడం, శిక్షణ అందించాలని పేర్కొన్నారు. యూనిక్ సెల్లింగ్ పాయింట్ ఉండాలని అన్నారు. జిల్లాలో ఉన్నా బీఎంసీ పూర్తి స్థాయిలో నడిచేలా చూడాలని దీనికి అవసరమైన సహాయసహకారాలు అందిస్తామని అన్నారు. పాడి రైతులతో సంప్రదింపులు జరిపి కార్యాచరణ తయారు చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు డైరెక్టర్ జనరల్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి కేవీఎస్ శైలజ, టెక్స్‌టైల్ పార్క్ పరిశ్రమల అసోసియేషన్ అధ్యక్షుడు అన్నల్‌దాస్ అనిల్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు పి హన్మంతు, ఎంఏ భారతి, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున్, పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, చేనేత జౌళి శాఖ ఏడీ సాగర్, విజయ డెయిరీ డీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా జన, కులగణన చేపట్టాలి..



కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు కుల గణనను చేపట్టాలని సీపీఐ బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు పంతం రవి డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సీపీఐ బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నాయకులు కలెక్టరేట్‌లో ఏవో రాంరెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పంతం రవి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీలను ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూస్తోందన్నారు. ఎన్నికలకు భారత దేశంలోని ప్రజలందరికి జాతి, కుల, వర్గ, లింగ వివక్షత లేకుండా దేశ ప్రజలందరికి సమానాత్వాన్ని సమాన హక్కులను కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. దేశంలో కానీ, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కానీ 50శాతం ఉన్న బీసీల జీవన ప్రమాణాలు మెరుగు పడకుండా ఎప్పుడు కూడా దేశ అభివృద్ధి జరగదని అందుకని సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి జరగాలంటే అన్ని రంగాల్లో సంపద అంతా వికేంద్రీకరణ జరుగాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ బిల్లు పెట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీ జనాభా ప్రాతిపాదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఎన్నికలను నిర్వహించాలన్నారు. బడ్జెట్‌లో నిధులు జనాభా ప్రాతిపాదికన కేటాయించాలని, బీసీ అట్రాసిటి చట్టాలన్నీ రూపొందించి కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. రెండులక్షల కోట్లతో బీసీ సంక్షేమ అభివృద్ధిపై ఖర్చు చేయాలని సబ్సీడీ రుణాలు వృత్తిదారులకు అందించాలని కోరారు. జిల్లాలో బీసీ భవనాన్ని నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజ్జ వేణు, సోమ నాగరాజు, గాజుల లింగం, కొంక విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి అంబేద్కర్ జయంతి

గంభీరావుపేట ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో జైతెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలో రమాబాయి అంబేద్కర్ జయంతి నిర్వహించారు. దోసెల చంద్రం, దోశల ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూలీ పెంచాలన్నందుకు పనులు ఇవ్వని యజమానులు

- సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్



కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న కార్మికులు, ఆసాములు

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : కూలీ పెంచాలంటూ కోరిన మరమగ్గాల కార్మికులకు పనులను ఇవ్వకుండా పరిశ్రమలను బంద్ చేసిన చేనేత కాటన్ చీరల తయారీ యజమానులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ డిమాండ్ చేశారు. కూలీ పెంచి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని చేనేత జౌళిశాఖ కార్యాలయంలో శుక్రవారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ అధ్వర్యంలో మరమగ్గాల కార్మికులు తరలి వచ్చి ఏడీని కలిసి వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ సిరిసిల్లలో మరమగ్గాలపై చేనేత కాటన్ చీరలను తయారుచేస్తున్న కార్మికులు, ఆసాములకు కూలీ అగ్రిమెంట్ గత సంవత్సరం మే నెలలో ముగిసిపోయిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కార్మికులు, ఆసాములు, యజమానులే ఆలోచించి కూలీ పెంచుతారని భావించి ఎనిమిది మాసాల నుంచి ఎదురుచూడడం జరిగిందన్నారు. కానీ యజమానుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఫిబ్రవరి 4వ తేదీన కార్మికులు, ఆసాములు కూలీ పెంచాలని యజమానులకు వినతిపత్రాలను అందజేశారన్నారు. దీనికి యజమానులు కార్మికులు, ఆసాములను పిలిపించుకొని వారిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు తాము పరిశ్రమలను బంద్ చేస్తున్నామని, ఒకవేళ పని చేయదలచుకుంటే యజమాన్యానికి భవిష్యత్తులో ఎలాంటి కూలీ అడగమని, అధికారులను కలవకూడదని యూనియన్ వద్దకు వెళ్లకూడదనే ఆంక్షలను విధించి రాతపూర్వకంగా రాసి ఇస్తేనే పనులను కల్పిస్తామని బెదిరింపులకు గురిచేశారన్నారు. కార్మికుల, ఆసాముల కష్టంతో బతుకుతూ వారిని బానిసల కింద పరిగణిస్తున్న, కాటన్ చీరలను తయారీ చేయిస్తున్న యజమానులపై చేనేత జౌళి శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. లేని పక్షంలో పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వడ్నాల వీరేశం, నాయకులు ప్రతాప్, సూర్యనారాయణ, వేణు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి


హర్షవర్ధన్(ఫైల్)

మంథని, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగాపురి సమీ పంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడు ప్రమాదంలో బోయిని పేటకుచెందిన ఇంటర్‌విద్యార్థి మిర్యాల హర్షవర్ధన్ (17)అనే బాలుడు మృతిచెందాడు. బోయినిపేటకు చెందిన మిర్యాల రాజు-స్వరూప దంపతుల కుమారుడు మిర్యాల హర్షవర్ధన్ ముత్తారం మండ లంలోని దర్యాపూర్ మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీవిభాగంలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. హర్షవర్ధన్ ఏపీ 15క్యూ 4780అనే ద్విచక్ర వాహనంపై గంగాపురి నుంచి మంథ ని వైపు వస్తుండగా రైస్‌మిల్లు సమీపంలో మంథని నుంచి పెద్దపల్లి వైపువెళ్తున్న బొలెరో వాహనం హర్షవర్ధన్ ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. హర్షవర్ధన్ వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్‌కు తగలడంతో కిందపడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న హర్షవర్ధన్‌ను స్థానికుల సమాచారం మేరకు 108లో ప్రభుత్వఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు ధ్రువీకరించారు. హర్షవర్ధన్ కుటుంబ సభ్యులంతా ఓ శుభకార్యం కోసం కరీంనగర్‌కు వెళ్లగా విషయం తెలుసుకొని హుటాహుటిన మంథనికి చేరుకున్నారు. రాజు దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉండగా కుమారుడి మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది. ప్రమాదానికి కారణమైన వాహనాలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు..

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన నెల్లి శంకరయ్య(65) కౌలు రైతు గురువారం పురుగులమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ శుక్రవారం మృత్యువాతపడ్డాడు. పోలీస్‌లు, కుటుంబ సభ్యులుతెలిపిన వివరాలప్రకారం.. శంకరయ్య మూడు సంవత్సరాలుగా గ్రామంలో మూడు ఎకరాల వ్యవసాయభూమి కౌలుకు తీసుకొని వరి సాగుచేస్తున్నాడు. దిగుబడిసరిగా రాక అప్పులపాలయ్యాడు. తీవ్రమన స్థాపానికి గురైన శంకరయ్య గురువారం పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృత్యువాత పడ్డాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

చివరి ఆయకట్టు సాగు కలేనా..


ఆగిపోయిన కాలువ పనులు

గత ప్రభుత్వంలో రూ.12.14 కోట్ల నిధులతో పనులు ప్రారంభం
ప్రభుత్వం మారడంతో అర్ధాంతరంగా నిలిచిన పనులు
కలగా మారిన 15 వేల ఎకరాల స్థిరీకరణ లక్ష్యం

ధర్మారం ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మూడు మండలాల రైతుల పంటల సాగే లక్ష్యంగా చేపట్టిన లింక్ కాలువ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో చివరి ఆయకట్టు సాగు కలగా మారింది. రూ.12.14 కోట్లతో 15 వేల ఎకరాల స్థిరీకరణే లక్ష్యంగా లింక్ కాలువ పనులు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టింది. అనంతరం ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో తలాపునే గోదావరి


కాలువపై నిర్మించిన బ్రిడ్జి

ఉన్న రైతుల పంటలకు నీరందని పరిస్థితి నెలకొంది.

ధర్మారం, ఎండపల్లి, వెల్గటూర్ మండలాల రైతుల పంటపొలాలకు ప్రధాన నీటి వనరు ఎస్ఆర్ఎస్‌పి 83బీ కాలువ. ఈ కాలువ ధర్మారం మండలం మల్లాపూర్‌లో మొదలై ధర్మారం, ఎండపల్లి, వెల్గటూర్ మండలంలోని చెగ్యాం వరకు 34 కిలోమీటర్ల మేర ఉంటుంది. మల్లాపూర్ వద్ద ఉన్న డిస్ట్రిబ్యూటర్ నుంచి ఈ కెనాల్ ద్వారా 188 క్యూసెక్కుల నీరు విడుదల కావాలి. కాని 70 నుంచి 100 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల చేస్తున్నారు. దీంతో యేటా ఆయా మండలాల రైతుల చివరి ఆయకట్టుకు నీరందక పొలాలు ఎండిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ లో భాగంగా మేడారం రిజర్వాయర్ నుంచి ఎస్ఆర్ ఎస్పి 83బీ కాలువకు లింక్ చేసి నీరందించాలని సంకల్పించింది. ఈ లింకు కాలువ ద్వారా 110 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ధర్మారం మండల కేంద్రం శివారులోని 10.2 కిలోమీటర్ వద్ద కలుపుతారు.

ఈ ఉద్దేశ్యంతో 2023లో రూ.12.14 కోట్ల నిధులు కేటాయించి హుటాహుటిన పనులు ప్రారంభించారు. అదే సంవత్సరం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ తూమ్ నిర్మాణంతో పాటు కాలువ తవ్వకం పనులు చేశారు. ఇంతలో ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారడం, ఇంత వరకు పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు బిల్లులు రాక పోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. యేటా వెల్గటూర్ మండలంలోని ముంజంపల్లి, మారేడుపల్లి, చెగ్యాం, ఉండెడ గ్రామలలోని వేల ఎకరాల్లో చివరి ఆయకట్టు ఎండిపోతుంది. రాజకీయ నాయకులు పంటలను పరిశీలించడం, వారికి తాత్కాలిక ఉపశమనం కలిగేల ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి నీటిని అందించడం నాయకులకు పరిపాటిగా మారింది. ఇప్పటికైనా నాయకులు స్పందించి నిలిచిపోయిన లింక్ కాలువ పనులు చేపట్టి మూడు మండలాల రైతులకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

మార్చిలో పనులు ప్రారంభిస్తాం
ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్ కుమార్.



గత ప్రభుత్వంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరు మీద మన నీళ్లను సిరిసిల్ల, సిద్దిపేట, హైదరాబాద్‌లకు తరలించి ఇక్కడి రైతులకు అన్యాయం చేశారు. బీఆర్ఎస్ ప్రభు త్వం చేసిన తప్పిదాల వల్ల ఇప్పటి వరకు చేప ట్టిన ప్రాజెక్టుల ఖర్చు మూడింతలు పెరిగింది. అయి నప్పటికి ఈ ప్రాంత ప్రజల కోసం పెండింగ్‌లో ఉన్న ప్రతీ పనిని చేపడుతాం. మేడారం లింక్ కాలువ పనులు కూడా మార్చి నెలలో చేపట్టి వీలైనంత తొంద రగా పూర్తి చేస్తాం. మూడు మండలాల ప్రజల చివరి ఆయకట్టు వరకు నీరందించే బాధ్యత నాది.

షేక్ సాబీర్‌అలీ రిమాండ్

జమ్మికుంట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలు సృష్టించి పట్టాభూమి కబ్జా చేసేందుకు ప్రయత్నించిన కాటిపల్లి రాజు, అతడికి సహకరించిన షేక్ సాబీర్‌అలీని పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని 464సర్వే నంబర్‌లో ఎండీ అరిఫుద్దీన్‌కు పట్టాభూమి ఉందన్నారు. కాటిపల్లి రాజు, కాటిపల్లి సంధ్య, కాటిపల్లి లక్ష్మి ఫోర్జరీ సంతకాలతో నకిలీపత్రాలు సృష్టించి సదరు భూమిలో టెంటు వేసి నిరాహార దీక్షకు దిగి యాజమానిని భయభ్రాంతులకు గురి చేశారన్నారు. అరిఫుద్దీన్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తెలిపారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు చేస్తున్న ఇద్దరి అరెస్టు

ఫైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సింగిరెడ్డిపల్లె గ్రామంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్న ఇద్దరిని గురువారం రాత్రి గోదావరిఖని టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. గ్రామంలోని జక్కటి ఎర్రక్క ఇంటి సమీపంలో పూజలు చేస్తుండడంతో అనుమానించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తవ్వకాలు జరుపుతున్న మంథనికి చెందిన పోగుల శ్రీనివాస్, మద్దిపాటి శ్రీనివాస్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద తవ్వకాలకు ఉపయోగించిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు సీఐ ప్రసాద రావు తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో ఆగిఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొని ఓవ్యక్తి అక్కడికక్కడేమృత్యువాత పడ్డాడు. ఇల్లందకుంటకు చెందిన పెద్ది భాస్కర్(35) పెద్దపల్లిలో ఓప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎప్పటిలాగే బైక్‌పై ఉద్యోగానికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో కోరపల్లి గ్రామంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌నుఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడేమృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య, నాలుగు సంవత్సరాల కుమార్తె ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్కానిపేట గ్రామసమీపంలో అక్రమంగా నిల్వఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన గంటఎల్లయ్య పీడీఎస్ బియ్యాన్ని సేకరించి నిలువ చేశాడనే సమాచారం మేరకు శుక్రవారం దాడిచేసినట్లు తెలిపారు. ఎల్లయ్య వద్ద 8క్వింటాళ్ల బియ్యం లభించగా నిందితుడి అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రికార్డులను ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

చందుర్తి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలోని అంబేద్కర్ యువజన సంఘం భవనంలోని రికార్డులను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి తగలబెట్టారు. సంఘం సభ్యుల కథనం ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు సంఘం భవనం తలుపుల తాళం పగలగొట్టి భవనంలో ఉన్న ట్రంక్‌పెట్టెను బయటపడేసి సంఘం రిజిస్ట్రేషన్, రిజిస్టర్లు, లెటర్ ప్యాడ్ లను తగలబెట్టారన్నారు. దుండగులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

న్యూపోరట్‌పల్లిలో విషాదం

● గజ్వేల్‌లో రోడ్డు ప్రమాదం ఇద్దరు మృతి ● కాంగ్రెస్ నేత, అతని మేనల్లుడు దుర్మరణం

జ్యోతినగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని నుంచి హైదరాబాద్‌కు కారు అద్దెకుతీసుకొని బయలు దేరిన వారు కొన్నిగంటల వ్యవధిలోనే విగతజీవులుగా మారారు. వివరాలు ఇలా ఉన్నాయి. న్యూపోరట్‌పల్లికి చెందిన మేరుగు లింగమూర్తి (48), అతనిసోదరుడు మహేశ్, లింగమూర్తి మేనల్లుడు ముష్కే బీనేష్ (28)లు వ్యక్తిగత పనికోసం శుక్రవారం తెల్ల వారుజామున బయలుదేరారు. రాత్రి వరకు తిరిగి వస్తామని పేర్కొన్నారు.

కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా ఉదయం 5గంటలసమయంలో గజ్వేల్ వద్ద ఆగిఉన్న లారీని ఢీకొనడంతో ఈప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో లింగమూర్తి, అతనిమేనల్లుడు బీనేష్ మృతిచెందగా లింగమూర్తి తమ్ముడు మహేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ ప్రణయ్‌సాగర్ స్వల్పంగా గాయపడ్డారు. మెరుగు లింగమూర్తి కాంగ్రెస్ పార్టీ ఎన్టీపీసీ పట్టణ ప్రధానకార్యదర్శిగా పని చేస్తున్నారు.


లింగమూర్తి ఇంటి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రాత్రివరకు తిరిగి వస్తామని ఇంటినుంచి బయలు దేరిన కుటుంబసభ్యులు తిరిగిరాని లోకాలకు వెళ్లారని తెలిసి ఆ కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మృతుడు లింగమూర్తికి భార్య భూలక్ష్మి, కుమార్తెలు అఖిల, అమూల్య, కొడుకు అభిషేక్ ఉన్నారు. కాంగ్రెస్‌పార్టీ స్థానిక సోషల్ మీడియాసెల్



మెరుగు లింగమూర్తి, ముష్కే బీనేష్(ఫైల్)

బాధ్యతలు చూస్తున్న బీనేష్‌కు తల్లి దండ్రులు చిన్నమ్మ, మల్లేష్ ఉన్నారు. బీనేష్ అవివాహితుడు.

కాంగ్రెస్ నేతల మృతికి ఎమ్మెల్యే సంతాపం..

కాంగ్రెస్ నాయకుడు లింగమూర్తి, బీనేష్ మృతి పట్ల రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, పార్టీ నాయకులు భరత్‌గౌడ్, ఎండీ ఆసీఫ్‌పాషా తదితరులు సంతాపం వ్యక్తంచేశారు. కాగా, మృతదేహాలకు పోస్టమార్టం చేసిన అనంతరం సాయంత్రం ఎన్టీపీసీ న్యూపోరట్‌పల్లికి తీసుకు వచ్చారు. శనివారం అంత్యక్రియలు జరిపేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జగిత్యాలలో ఏసీబీ సోదాలు

● ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని హన్మకొండ డీటీసీపై ఫిర్యాదులు
● ఇంట్లోని పలు రికార్డులు స్వాధీనం

జగిత్యాలక్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలో శుక్రవారం హన్మకొండ జిల్లా డిప్యూటి ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. జగిత్యాలలోని విజయపురి కాలనీకి చెందిన పుప్పాల శ్రీనివాస్ హన్మకొండ జిల్లాలోని రవాణా శాఖలో డిప్యూటిట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శ్రీనివాస్ ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని ఏసీబీకి ఫిర్యాదు వచ్చింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా శ్రీనివాస్‌కు సంబంధించిన కుటుంబ సభ్యులు, సన్నిహితుల ఇళ్లలో ఏసీబీ అధికారులు శుక్రవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. జగిత్యాలలో శ్రీనివాస్ తండ్రి రాంచంద్రం ఇంటిలో


సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. రెండు గంటలకుపైగా సోదాలు నిర్వహించిన అధికారులు పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

మద్యం మత్తులో ఆర్టీసీ మహిళా కండక్టర్‌పై దౌర్జన్యం

● ఇద్దరు వ్యక్తుల పై కేసు నమోదు

రామగిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఆర్టీసీ మహిళా కండక్టర్ పై దురుసుగా ప్రవర్తించి దౌర్జన్యానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రకుమార్ శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి కరీంనగర్ నుంచి మంథని వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు సెంటినరీకాలనీలోని తెలంగాణ సెంటర్‌కు చేరుకుంది. కారులో ఆర్టీసీ బస్సును వెంబడిస్తున్న గుండారం గ్రామానికి చెందిన రాచకొండ రవి, మోతె రాజయ్యలు కారును బస్సుకు అడ్డంగా నిలిపి డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగడంతో పాటు మహిళా కండక్టర్ పై దురుసుగా ప్రవర్తించి దౌర్జన్యానికి దిగడంతో స్థానికులు అడ్డుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కండక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురి పై కేసు నమోదు చేసి కార్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


శ్యామ్ సుందర్ (ఫైల్)

అంతర్గాం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి శివారులో ఎగువ వైపు పట్టాలపై ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి సిద్ధ శ్యామ్‌సుందర్(34) అనే యువకుడు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే జీఆర్‌పీ రామగుండం ఇన్‌చార్జి తిరుపతి తెలిపినవివరాల ప్రకారం కుందన పల్లికి చెందిన శ్యామ్ సుందర్ ఎన్టీపీసీ యాష్‌పాండ్‌లో కాంట్రాక్టు కార్మికునిగా పని చేస్తున్నాడు. శ్యామ్‌సుందర్ మద్యానికి అలవాటు పడడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెంది జీవితంపై విరక్తి కలగడంతో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య,కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తిరుపతి పేర్కొన్నారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తుచేస్తున్నట్లు జీఆర్‌పీఇన్‌చార్జి తిరుపతి తెలిపారు.

కోర్టు సమన్లు ధిక్కరించిన ఐదుగురికి జైలు

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కోర్టు సమన్లు ధిక్కరించిన ఐదుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి వారంరోజుల చొప్పున జైలుశిక్ష విధిస్తూ జగిత్యాల జ్యూడిషయల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వినీల్ కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. పెగడపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పరిసె రాయమల్లు, నామసాని రాజయ్య, నామసాని రాజ్ కుమార్, ఎనగందుల విక్రమ్, సట్ల నాంపెల్లి అనే ఐదుగురు వ్యక్తులు పలు కేసుల్లో కోర్టునుంచి సమన్లు పొంది కేసువిచారణకు గైర్హాజరవుతున్నారు. కోర్టు ఆదేశాలు లెక్కచేయకుండా తప్పించుకు తిరుగుతున్న ఐదుగురు వ్యక్తులపై కోర్టు వారంట్ జారీ చేసింది. పెగడపెల్లి ఎస్సై రవి కిరణ్ శుక్రవారం ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. దీంతో న్యాయమూర్తి తీవ్రంగా పరిగణించి జైలు శిక్ష విధించారు.

ఆయుర్వేద కంపెనీ యజమానికి నెల రోజుల జైలు శిక్ష

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌అండ్‌మ్యాజిక్ రెమడీస్ యాక్ట్-1954 ధిక్కరణకింద ఓఆయుర్వేద కంపెనీ యజమానికి నెల రోజుల జైలు శిక్ష లేదా రూ.10వేల జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు జూనియర్ సివిల్‌జడ్జి జితేందర్ శుక్రవారం తీర్పు వెలువరించారు. జగిత్యాల జిల్లా డ్రగ్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఉపేందర్ 2024 సంవత్సరంలో పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఓకంపెనీ ఆయుర్వేదిక్‌కు సంబంధించిన పలుమాత్రల లేబుల్స్‌పై తప్పుదోవ పట్టించే ఆరోగ్య వాదనలు ఉన్నట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గుర్తించి కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో ఆయుర్వేద మందుల కంపెనీ యజమానికి జైలు శిక్ష లేదా జరిమానా చెల్లించాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హుజూరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన కొలుగూరి సుజిత్ (30) చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుజిత్ కొద్ది రోజులుగా ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. కానీ ఆమె తనను ప్రేమించలేదని మనస్థాపంతో ఉంటున్నాడు. గురువారం హుజూరాబాద్ పట్టణంలోని బీఎస్‌ఆర్ గార్డెన్‌సమీపంలో పురుగులమందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైనవైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి సోదరుడు సూర్యకిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

నాటుబాంబు పెట్టిన వ్యక్తి అరెస్టు

కోనరావుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ సైలెన్సర్‌లో నాటు బాంబు పెట్టిన ఓ యువకుడిని కోనరావుపేట పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఎస్సై ప్రశాంత్‌రెడ్డి కథనం ప్రకారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన గురక ఎల్లయ్య తన ట్రాక్టర్ సైలెన్సర్‌లో గత ఏడాది డిసెంబర్ 29న రాత్రి సమయంలో నాటుబాంబు పెట్టారని ఫిర్యాదు చేశాడు. ఈసంఘటనపై విచారణచేపట్టగా వెంకట్రావుపేట గ్రామానికి చెందిన మానుక మహిపాల్ అలియాస్ మహేష్ అనే వ్యక్తి నాటుబంబును పెట్టాడని తేలడంతో పాటు అతడి వద్ద ఒక నాటు బాంబును స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలు

దండేపల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్ళపేట గ్రామ శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం వెల్గొండ గ్రామానికి చెందిన అక్కల శేఖర్- సునీత అనే దంపతులకు తీవ్రగాయాలు అయ్యాయి. భార్యభర్తలు ఇద్దరుబైక్‌పై జన్నారం మండలం రోటిగూడ వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో బైక్‌ను ట్రాక్టర్‌ఢీకొట్టడంతో ద్విచక్రవాహనంపైఉన్న సునీత తలకు తీవ్రగాయాలయ్యాయి. శేఖర్‌కు చేయి విరిగింది. గాయపడిన వీరిని స్థానికులు 108లో చికిత్సకోసం లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం సునీతను మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. సంఘటనస్థలానికి దండేపల్లి పోలీసులు చేరుకోని ప్రమాదానికిగల వివరాలు సేకరించారు.

ప్రత్యర్థుల ఆత్మీయ పలకరింపులు..

● మాజీ మంత్రి కేటీఆర్, కాంగ్రెస్ నాయకుడు కేకే కలయికపై ఆసక్తి


రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో ఆత్మీయంగా పలకరించుకుంటున్న కేటీఆర్, కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల/గంభీరావుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వారి మధ్య నిత్యం రాజకీయ విమర్శల పోరు కొనసాగుతుంది... మరోవైపు సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పరస్పరం పోటీపడుతారు... అయినా ఇద్దరూ ఆత్మీయంగా పలకరించుకోవడం అందరిలో ఆసక్తిని కలిగించింది. శుక్రవారం రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో రెడ్డి సేవా సంఘం నూతనంగా నిర్మించిన గణపతి ధ్వజ యుక్త శ్రీ మహాకాళి అమ్మవారి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి బీఆర్ఎస్ రాష్ట్రవర్కింగ్ అధ్యక్షుడు కే తారకరామారావు, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిలు హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో ఒకరికి ఒకరు తారసపడగా మహేందర్ అన్నా బాగున్నావా.. అంటూ కేటీఆర్ పలకరించగా, ఫైన్ ఫైన్.. అంటూ మహేందర్ రెడ్డి బదులిచ్చారు. ఇద్దరూ కాసేపు ముచ్చటించుకున్నారు. రాజకీయాలు పక్కనపెట్టి ఆత్మీయంగా పలకరించుకోవడం అక్కడున్న వారందరిలోనూ ఆసక్తిని కలిగించింది.

గుట్కా ప్యాకెట్లు తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

మహదేవపూర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గుట్కా, తంబాకు, పాన్‌మసాలా ప్యాకెట్లు తరలిస్తున్న వ్యాన్‌ను పోలీసులు మండల కేంద్రం శివారులో శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్సై పవన్ తెలిపారు. పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా కాటారం వైపునుంచి వచ్చిన గూడ్స్‌వ్యాన్ అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో దానిని ఆపి తనిఖీచేయగా భారీగా గుట్కా, తంబాకు (అంబర్), పాన్‌మసాలా ప్యాకెట్లున్న సంచులు కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకుని వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. 51 సంచుల్లో ఉన్న ఈ పాకెట్ల విలువ సుమారు రూ.7.92 లక్షలు ఉంటుందని చెప్పారు. పెద్దపల్లి జిల్లా


పట్టుకున్న వ్యాన్‌తో పోలీసులు

గోదావరిఖని పట్టణానికి చెందిన వేల్పుల సంతోష్, షేక్ పర్వేజ్‌ను అదుపులోకి తీసుకున్నామని, కొంతకాలంగా ఈ ప్యాకెట్లను కిరాణాషాపులకు సరఫరా చేస్తున్నట్లు వారు ఒప్పుకోగా కేసు నమోదు చేశామని వెల్లడించారు.

వాగులో పడి పెయింటర్ మృతి

ధర్మపురి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని తెనుగువాడ సమీపంలో గల వాగులో శుక్రవారం ప్రమాదవశాత్తు పడి ఎండీ హమీద్ (35) అనే పెయింటర్ మృతిచెందాడు. జగిత్యాలకు చెందిన హమీద్ ధర్మపురిలో పెయింటర్‌గా పనిచేస్తున్నాడు.

సాయంత్రం ఇంటి నుంచి బహిర్భూమి కోసం బయలుదేరిన హమీద్ కాలు జారి వాగులో పడి మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై ఉదయ్ కుమార్ పరిశీలించారు.

విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా...

జిల్లెల్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 'వాటర్ బెల్స్'కు శ్రీకారం..



వాటర్ బెల్ సమయంలో నీళ్లు తాగుతున్న విద్యార్థులు

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి చదువుకోవాలన్న లక్ష్యంతో తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు 'వాటర్ బెల్స్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు అనురాధతోపాటు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమామాన్ని శుక్రవారం ప్రారంభించారు. పాఠశాలలో చదువుతున్న 165 మంది విద్యార్థులందరూ ఇంటినుంచి పాఠశాలకు వచ్చి తిరిగి ఇంటికి చేరే వరకు వారితో కనీసం రెండు(ఉదయం, మధ్యాహ్నం) లీటర్ల నీటిని తాగించాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా రోజుకు రెండుసార్లు వాటర్ బెల్స్‌ను మోగించే ప్రక్రియను శ్రీకారం చుట్టారు. విద్యార్థులు వాటర్ బాటిల్స్ వెంట తెచ్చుకోవాలని, క్లాస్ ముగిసిన వెంటనే కొంత నీరు తాగాలనే కండిషన్ పెట్టారు. విద్యార్థులు ప్లాస్టిక్ బాటిళ్లతో వస్తుండడం గమనించిన ఉపాధ్యాయులు దాతల సహాయంతో స్టీల్ బాటిల్స్‌ను సమకూర్చారు. బెల్ మోగిన వెంటనే విద్యార్థులందరు కూడా పాఠశాల అవరణలోకి వచ్చి నీటిని తాగాల్సి ఉంటుంది. వీరితోపాటు ఉపాధ్యాయులు కూడా నీటిని తాగుతున్నారు.



అనుభవాల పాఠాలు..

హెచ్ఎంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అనురాధ గతంలో ఎదుర్కొన్న ఇబ్బందులతో పాటు ప్రసార మాధ్యమాల్లో వచ్చిన కథనాలు వల్ల నీటిని తక్కువగా సేవించడం వల్ల కొలెస్ట్రాల్‌పెరుగుతుందని తెలుసుకున్నారు. దీంతో తాను పనిచేసే చోట విద్యార్థులకు అవసరమైనంత నీరు తాగాల్సిన ఆవశ్యకతను వివరించారు. అంతేకాకుండా విద్యార్థులు ఖచ్చితంగా నీరు సేవించేందుకు అవసరమైన వాతావరణమూ కల్పించాలని భావించారు. తాను చేస్తున్న ఈ ప్రయత్నానికి తనతో పాటు సహచర ఉపాధ్యాయ బృందం కూడా చేతులు కలపడంతో సక్సెస్ అవుతున్నానని చెప్పారు హెచ్ఎం అనురాధ.

పిల్లలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో..

జోగినపల్లి అనురాధరావు, ప్రధానోపాధ్యాయురాలు జిల్లెల్ల



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అనారోగ్యంతో పాటు చదువుపై అనాసక్తితో ఇబ్బందులు పడుతుండడాన్ని గమనించాను. వాతావరణంలో ఏర్పడిన మార్పులవల్ల వారం రోజుల నుంచి విద్యార్థులు ప్రార్థన సమయంలో పడిపోతుండడంతో గమనించి నీళ్లు తాగడం లేదని తెలుసుకున్నాను. విద్యార్థు లతో నీళ్లు తాగించాలనే ఉద్దేశంతో 'వాటర్ బెల్స్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాను.

పంట చేలల్లో సౌర విద్యుత్

PM KUSUM Scheme



- 'పీఎం కుసుమ్'తో 70శాతం రుణాలు
- జిల్లాలో 100 మెగావాట్ల ఉత్పత్తికి నిర్ణయం
- ఈనెల 22 వరకు దరఖాస్తుల స్వీకరణ
- మహిళా సంఘాలకు ప్రాధాన్యం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రైతులు పంట పొలాల్లో ఆహారధాన్యాలే కాదు.. ఇక నుంచి సౌర విద్యుత్‌ను కూడా ఉత్పత్తి చేస్తారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి కిసాన్ సురక్షా ఊర్జ ఏవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం కుసుమ్) పథకం అమలు ద్వారా రైతుల పంట పొలాల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీరెడ్‌కో) దీని అమలుకు నోడల్ ఏజెన్సీగా ఉన్నది. ఈ సంస్థ రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. రైతులకు అదనపు ఆదాయవనరులను సమకూర్చడం ద్వారా వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన ఈ పథకం కింద రాష్ట్రంలో 4,000 మెగావాట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు.

ఇందులో 3,000 మెగా వాట్ల విద్యుత్‌ను రైతులు, సమష్టి, వ్యవసాయ క్షేత్రాల నిర్వహణ సంస్థలు, రైతుల సమూహం ద్వారా, 1000 మెగావాట్లను మహిళా సంఘాల ద్వారా ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టు కున్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 400 మెగావాట్లు, వ్యక్తిగతంగా కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో వందేసి మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. ఒక్కో రైతుకు రెండు మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం కల్పించా లని నిర్ణయించారు. ఒక్కో జిల్లా లో రెండేసి మహిళా సంఘాలను ఎంపిక చేసి వాటి ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలని మహిళా సంఘాలకు అందుకు అవసరమైన మేరకు ప్రభుత్వ స్థలాలను సమకూర్చాలని నిర్ణయించారు.

జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో మహిళా సంఘాలకు యూనిట్లను కేటా యిస్తున్నారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం దత్తోజీపేట, వీణవంక వ ుండ లం గన్ముకుల, పెద్దపల్లి జిల్లాలో మంథని మండలం సిరిపురం, కాల్వ శ్రీ రాంపూర్ మండల కేంద్రంలో, జగిత్యాల జిల్లాలో తాటిపల్లి, వెల్గటూర్ మండలానికి చెందిన స్థంభంపల్లిలో మహిళా సంఘాల ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పాలని నిర్ణయించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రాంతాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతున్నది.



యూనిట్ల స్థాపన ఇలా..

500 కిలో వాట్స్ (0.5మెగావాట్స్) నుంచి 2000 కిలో వాట్స్ (2 మెగావాట్స్) విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతిస్తారు. అర మెగావాట్ ప్లాంట్ నెలకొల్పేందుకు 2 ఎకరాలు, ఒక మెగావాట్ ప్లాంట్ ఏర్పాటుకు 4 ఎకరాలు, 1.5 మెగావాట్ ప్లాంట్‌కు 6 ఎకరాలు, 2 మెగావాట్ ప్లాం ట్లకు 8 ఎకరాల భూమి అవసరమవుతుంది. వీటిని స్థాపించేందుకు అర మెగావాట్ ప్లాంట్‌కు సుమారుగా కోటి 5వేల రూపాయలు, ఒక మెగావాట్ ప్లాంట్‌కు 3 కోట్లు, 1.5 మెగావాట్ ప్లాంట్‌కు 4 కోట్లు, 2 మె.వా. ప్లాంట్‌కు 6 కోట్లు రూపాయలు అవసరముంటాయి.

ఇందులో 70శాతం జాతీయ బ్యాంకుల నుంచి రుణంగా సమకూరుస్తారు. లబ్ధిదారులు 30శాతం సొమ్మును భరించాల్సి ఉంటుంది. మహిళా సంఘాలు 25 నుంచి 30 లక్షల రూపాయలు చెల్లిస్తే ఏ కెపాసిటీ ప్లాంట్‌నైనా నెలకొల్పుకోవచ్చు. మిగతా సొమ్మును బ్యాంకు రుణంగా సమకూరు స్తారు. అర మెగావాట్ ప్లాంట్ ద్వారా నెలకు 72,000 యూనిట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఒక మె.వా. ప్లాంటులో 1,44,000 యూనిట్లు, 1.5 మెగావాట్ ప్లాంట్‌లో 2,16,000 యూనిట్లు, రెండు మెగావాట్ ప్లాంటుల్లో 2,82,000 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఉత్పత్తి అయిన విద్యుత్‌కు యూనిట్‌కు 3.13 రూపాయలు చెల్లించి డిస్కంలు కొనుగోలు చేస్తాయి. అర మెగా వాట్ ప్లాంట్ నిర్వాహకులకు నెలకు 2,25,360 రూపాయలు, 1 మెగావాట్ ఉత్పత్తిదారులకు 4,50,720 రూపాయలు, 1.50 మెగావాట్ ఉత్పత్తిదారులకు 6,76,080 రూపాయలు, 2 మెగావాట్ ఉత్పత్తిదారులకు 9,01,440 రూపాయలు ఆదాయంగా సమకూరుతాయి.

25 సంవత్సరాల పాటు ఈ సౌర విద్యుత్ ఉత్పత్తిద్వారా సమకూరే ఆదాయంపై ఎలాంటి టాక్సు విధించరు. రైతులు 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఉన్న 5 కిలో మీటర్ల పరిధిలో సౌర విద్యుత్ ప్లాంట్‌ను నెలకొల్పుకొనేందుకు దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. తమ పంట పొలాల నుంచి సబ్‌స్టేషన్ వరకు విద్యుత్ ట్రాన్స్‌మిషన్ కోసం రైతు లు లైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకు ఒక కి.మీ. లైన్‌కు 6.50 లక్షలు అవసరమవుతాయి. మహి ళా సంఘాలకు మాత్రం ఈ లైను నిర్మాణ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది.

దరఖాస్తుల ఆహ్వానం

రైతులు ఒక మెగావాట్ సౌర విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ నెలకొల్పేందుకు చేసుకునే దరఖాస్తుకు 6వేల రూపాయలను రుసుముగా చెల్లించాలి. ఆపైన ఎంత ఉత్పత్తి పెరిగినా దరఖాస్తు రుసుము 12వేలు ఉంటుంది. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేది ఫిబ్రవరి 22. ఇప్పటికే కరీంనగర్ జిల్లాలో 13.5 మెగావాట్ యూనిట్ల స్థాపనకు 11 దరఖాస్తులు, పెద్దపల్లి జిల్లాలో 14.5 మెగావాట్ యూనిట్లకు 11 దరఖాస్తులు, జగిత్యాల జిల్లాలో 5 మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల కోసం 6 దరఖాస్తులు వచ్చాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 4 దరఖాస్తులు వచ్చాయి. వీరు 6 మెగావాట్స్ విద్యుత్ ఉత్పత్తికి సంసిద్ధత తెలుపుతూ దరఖాస్తు చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో జిల్లాకు 100 మెగావాట్ చొప్పున 400 మెగావాట్ వరకు సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు యూనిట్ల స్థాపనకు అవకాశముండగా ఇప్పటి వరకు 39 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి దరఖాస్తులు వచ్చాయి.

ఓమన్‌లో కన్నుల పండువగా రాజరాజేశ్వర స్వామి కల్యాణం

పట్టు వస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశమైన ఓమన్‌లో శ్రీరాజరాజేశ్వర స్వామివారి కల్యాణోత్సవాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఓమన్ తెలంగాణ సమితి ఆధ్వర్యంలో మస్కట్‌లోని బర్క్ సిటీలో వేదపండితులు శ్రీరాజరాజేశ్వర స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ రాజ రాజేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవం తొలిసారిగా మస్కట్‌లో నిర్వహించడం అభినందనీయమన్నారు. గల్ఫ్‌లోని తెలంగాణ కార్మికులు తమ వేదనను మరి చిపోయి, దేశ సంస్కృతిని విదేశాల్లో పరి రక్షిస్తూ బ్రహ్మోత్సవాలు, కల్యాణ మహో త్సవాలు, పండుగలు నిర్వహించడం గర్విం చదగిన విషయమన్నారు. గల్ఫ్‌లోని తెలం గాణ కార్మికుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.



పట్టు వస్త్రాలు తీసుకు వెలుతున్న ఆది శ్రీనివాస్

ఆలోచన అదిరే..

కోతులు బెదిరే..



ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వనాలు వీడిన వానరాలు గ్రామాలతో పాటు పంట పొలాల్లో హంగామా చేస్తున్నాయి. పంటలను సాగు చేసిన రైతులకు కోతుల బెడద తప్పడం లేదు. పంటను కాపాడుకునేందుకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రైతు పారిపెల్లి సంజీవరెడ్డికి ఓ ఆలోచన తట్టింది. గ్రామ శివారులో తనకున్న 2.50 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన వరి చేనును కోతుల నుంచి రక్షించుకునేందుకు కొండముచ్చు చిత్రపటాలను అక్కడక్కడా ఏర్పాటు చేశాడు. సుమారు రూ.800 వెచ్చించి రెండు ఫ్లెక్సీలను పొలంలో ఉంచడం వల్ల కోతులు బెదిరి పారిపోతున్నాయని రైతు సంజీవరెడ్డి పేర్కొంటున్నాడు. నిత్యం పొలం వద్ద కాపలా ఉండాల్సిన పని తప్పిందని పేర్కొంటున్నాడు.

రాజన్న ఆలయంలో

భక్తుల రద్దీ



వేములవాడ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు.



నామినేషన్ల ఊరేగింపులో భాగంగా తెలంగాణచౌక్‌లో అభ్యర్థుల ర్యాలీ

ర్యాలీల హోరు.. నామినేషన్ల జోరు

- పట్టభద్రుల స్థానానికి 28
- ఉపాధ్యాయ స్థానానికి 2
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన అభ్యర్థులు

కరీంనగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు గడువు సమీపిస్తుం డడంతో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేశారు. శుక్ర వారం ఒక్కరోజే పట్టభద్రుల స్థానానికి 28 మంది, ఉపాధ్యా య ఎమ్మెల్సీ స్థానానికి ఇద్దరు మొత్తం 30 నామినేషన్లను దాఖలు చేశారు. పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోటాపోటీగా భారీ ర్యాలీగా వచ్చిన నామినేషన్లు వేయడంతో నగరంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోలాహలం కనిపించింది. పట్ట భద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షు డు బాస సత్యనారాయణరావు, మాజీ మేయర్ సునీల్‌రావుతో కలిసి మహాశక్తి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనం తరం నామినేషన్ పత్రాలను అందజేశారు.

అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పార్టీ శ్రేణులతో కలిసి మహాశక్తి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలె క్టరేట్‌కు చేరుకొని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి నామినేషన్ పత్రాల ను అందజేశారు. స్వతంత్ర అభ్యర్థి అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రస న్న హరికృష్ణ ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలా బాద్, మెదక్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పట్ట భద్రు లు, అభిమానులతో కలిసి ఎస్ఆర్ఆర్ కళాశాల నుంచి డప్పు చప్పుళ్లు, ఒగ్గడోలు బృందాలు, కళాకారుల ఆటపాటలతో భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకొని నామినేష న్ అందజేశారు. డీఎస్సీ పదవికి రాజీ నామా చేసిన మదనం గంగాధర్ కోర్టు సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్ నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి పట్టభద్రు ల ఎమ్మెల్సీ స్థానానికి నామి నేషన్ వేశా రు. టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి పీఆర్టీ యూ నాయకుడు వంగ మహేందర్ రెడ్డి మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీగా వచ్చి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ వేయగా, ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు తరపున నామినేషన్ వేయించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కరీంనగర్‌కు చెందిన దయ్యాల ఓంప్రకాశ్, డాక్టర్ బండారి రాజ్ కుమార్, న్యాం తాబాద్ జనార్దన్,సంకినేని మధుసూదన్ రావు, మెక్కు హేమలత, మహ్మద్ ముస్తాక్ అలీ,మంథని మండలం పుట్ట పాకకు చెందిన సిహెచ్.పురుషోత్తం, ఇప్పటి వరకు 58 మంది నామినేషన్లు వేయగా పట్టభద్రుల స్థానానికి 49 మంది, టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 9 మంది నామినేషన్లు వేశారు.

సోనియాకు గిఫ్టుగా అందిస్తాం

10న నరేంద్రుడి నవరత్నాల పేరిట అజెండా ప్రకటిస్తా

కరీంనగర్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి



నామినేషన్ వేస్తున్న ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

సుబాష్‌నగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కార్య కర్తలు, నాయకులు, నా శ్రేయోభిలాషుల అండదండలతో కరీంనగర్ శాసనమండలి పట్టభద్రుల స్థానాన్ని హస్తగతం చేసుకొని, పార్టీ అధినేత్రి సోనియా గాంధీకి బహుమతిగా అందిస్తానని ఆ పార్టీ నుంచి పట్టభద్రుల కరీంనగర్ స్థానం అభ్యర్థి ఊట్కూరి నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయ న కుటుంబసభ్యులతో కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 10న టీపీసీసీ అధ్యక్షు డు మహేందర్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డితోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మరో సెట్ వేయనున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ పాలన

బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి

సుభాష్‌నగర్ : రాష్ట్రంలో గత ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగి స్తోందని బీజేపీ పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డి ఆరోపించారు. శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బాస సత్యనారాయనతో కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ వేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన 420 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించ కుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ, ప్రజా పాలన అని చెప్పి రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలనను సాగిస్తోందని విమర్శించారు.



నామినేషన్ వేస్తున్న ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి

కామన్‌మెన్‌కు కార్పొరేట్ శక్తికి మధ్య ఎన్నిక

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



నామినేషన్ వేస్తున్న స్వతంత్ర అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ

సుభాష్‌నగర్ : ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నిక కామన్‌మెన్‌కు కార్పొరేట్ శక్తికి మధ్య జరుగుతున్న ఎన్నిక అని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ ప్రసన్న హరికృష్ణ అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రభుత్వ ఎస్ఆర్ఆర్ కాలేజ్ నుంచి డప్పు, ఒగ్గుడోలు వాయిద్యాలు, నృత్యాలు చేసుకుంటూ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా నామి నేషన్ వేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లా డారు. తన నామినేషన్ కార్యక్రమానికి నాలుగు ఉమ్మడి జిల్లాల నుంచి పట్టభద్రులు తరలి వచ్చారన్నారు. జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడు తూ ప్రసన్నహరికృష్ణ తన 19 సంవత్సరాలు సర్వీసు ఉన్న ప్పటికీ ఉద్యోగానికి రాజీనామా చేశారని తెలిపారు.

పీఆర్టీయూటీఎస్‌తోనే సమస్యలు పరిష్కారం

పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూటీఎస్ తోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థి, పీఆర్టీయూటీఎస్ అధికార అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి స్థానిక పద్మనాయక కల్యాణ మండపం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా చేరుకొని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామి నేషన్ వేశారు. అనంతరం ప్రెస్‌భవన్‌లో ఆయన ఉపాధ్యాయ, అధ్యాపకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల అవగాహన ఉన్న వ్యక్తి వంగ మహేందర్‌రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్సీ బి మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి ఉన్నారు.



నామినేషన్ అందజేస్తున్న పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి

తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు..

- రాజేందర్, ఎంపీడీవో, గంభీరావుపేట



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎంపీడీవో : వేసవిని దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు చేపడుతాం. గ్రామాలవారీగా పంచాయతీకార్యదర్శులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటాం. వేసవిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండే గ్రామాలను గుర్తించి, ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై సూచనలిస్తాం.

ఆంధ్రజ్యోతి: డ్రైనేజీలు, వీధిదీపాల సమస్యలపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎంపీడీవో : మండల కేంద్రంతో పాటు ఆయాగ్రామాల్లో డ్రైనేజీల సమస్య లేకుండా చూడాలని పంచాయతీ అధికారులకు ఇప్పటికే చెప్పాం. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రంచేయాలని,వీధిదీపాల సమస్యపై కూడా చర్యలు తీసుకుంటున్నాం. సమస్య పరిష్కారం కాకుంటే నా దృష్టికి తీసుకరావాలి.

ఆంధ్రజ్యోతి: ప్రజా పాలన గ్రామ సభల్లో వచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎంపీడీవో : పైలెట్ గ్రామంగా ఎంపికైన దమ్మన్నపేటలో అర్హులందరికి పథకాలకు సంబంధించి, ప్రొసీడింగ్ పత్రాలను అందజేశాం. మిగతా గ్రామాల్లో జరిగిన ప్రజా పాలన సభల్లో అర్హుల జాబితాను ప్రజల సమక్షంలో చదివివినిపించాం.అర్హులకు న్యాయం జరుగుతుంది. ఆందోళన అవసరం లేదు.

- గంభీరావుపేట (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీశైలం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్సీగా తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు, మద్దతుదారులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీకి నోటీసులు

రుద్రంగి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై గ్రామపంచాయతీకి హైకోర్టు నోటీసులు జారీ చేసినట్లు పిటిషనర్ పిట్టల నరేష తెలిపారు. రుద్రంగి మండల కేంద్రంలో 428/2, 429/3, 428/4 గల ప్రభుత్వ భూమిలో ఇంటి నిర్మాణానికి గ్రామ పంచాయతీ అధికారులు అనుమతి ఇవ్వడంతో రుద్రంగికి చెందిన పిట్టల నరేష్ అనే వ్యక్తి ప్రజాప్రయోజన వాజ్యం(పిల్)ను దాఖలు చేశారు. హైకోర్టులో శుక్రవారం విచారణ జరగగా అడ్వకేట్ తీగల రామ్‌ప్రసాద్‌గౌడ్ వాదనలు ఏకీభవిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా డీపీవోకు సమగ్ర విచారణ జరిపి 15 రోజుల్లో నివేదిక సమర్పించాలని హైకోర్టు ఆదేశించినట్లు పిటిషనర్ పిట్టల నరేష్ తెలిపారు.

నిరుపేద కుటుంబానికి పరామర్శ

వీర్నపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన నిరుపేద యువకుడు గడ్డం శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కల రాము సంఘ నాయకులతో కలిసి శుక్రవారం పరామర్శించారు. కుటుంబానికి ముదిరాజ్ సంఘం తరఫున అండగా ఉంటామని తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండల ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు దండు శ్రీనివాస్, వేములవాడ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నందగిరి లింగం, మాజీ ఎంపీటీసీ పంబాల హనుమండ్లు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ మున్సిపల్ విలీన గ్రామమైన తిప్పాపురంనకు చెందిన గుడిసె మల్లేశం కొన్నిరోజుల క్రితం దుబాయ్‌లో ప్రమాదవశాత్తు మృతిచెందగా ఎమ్మార్పీఎస్ నాయకుడు గుండా థామస్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. మ్యాకల జీవన్, సంతోష్, ల్యాగల వరప్రసాద్ ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపాక గ్రామానికి చెందిన అన్నాడి బాల్‌రెడ్డికి సీఎం సహాయ నిధి చెక్కును కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దయాసాగర్ శుక్రవారం అందించారు. బాల్‌రెడ్డి అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరగా సీఎం సహాయనిధి ద్వారా రూ.15వేలు మంజూరయ్యాయి. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే సత్యనారాయణకు లబ్ధిదారుడు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నందం, రాంలింగారెడ్డి, లక్ష్మారెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు..

కనగర్తిలో వైద్య శిబిరం

కోనరావుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో మండల వైద్యాధికారి వేణు మాధవ్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అఖిల్ వైద్య బృందం పాల్గొన్నారు.

భగీరథ వచ్చినా... తొలగని విద్యుత్ భారం

(5వ పేజీ తరువాయి)

వినియోగించుకోవడం లేదని తెలుస్తోంది. గతంలో మున్సిపల్, మండల పరిషత్, జడ్పీ సమావేశాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా లోపాలపై సభ్యులు ప్రశ్నించిన సందర్భాలు ఉన్నాయి.



ఇల్లంతకుంటలో పవర్ బోర్



మిషన్‌భగీరథ నీటి శుద్ధి కేంద్రం

జిల్లాలో మిషన్ భగీరథ ఇలా..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 మండలాల్లోని 260 గ్రామపంచాయతీలతో కలిపి 359 ట్యాంకులు ఉన్నాయి. వీటికి గతంలో బోరు బావులు, మంచినీటి చెరువుల ద్వారా నీటిని శుద్ధిచేసి మోటార్ల ద్వారా నీరు ఎక్కించి నల్లాల ద్వారా నీటి సరఫరా చేసేవారు. గత ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి శుద్ధజలం అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లాలో 359 పాతట్యాంక్‌లు, 227 కొత్త ట్యాంక్‌లు ఏర్పాటు చేశారు. 1263.77 కిలోమీటర్ల మేరకు పైపులైన్లు వేశారు.

జిల్లాలో 117034 నల్లా కనెక్షన్లు ఇచ్చినట్లు లెక్కలు చెబుతున్నాయి. వంద శాతం మిషన్ భగీరథ పూర్తి చేసి నీటి సరఫరా చేస్తున్నామని తరచూ చెబుతున్న మాటలపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా జరిగితే ప్రతినెలా గ్రామపంచాయతీలకు విద్యుత్ బిల్లుల భారం ఎందుకనే విమర్శలు వస్తున్నాయి.

కన్నుల పండువగా అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



అయ్యప్పస్వామికి ఆభరణాలు తీసుకవస్తున్న భక్తులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అయ్యప్పస్వాములు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం కన్నుల పండువగా జరిగింది. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో ఐదు రోజులుగా ఉత్సవాలు జరుగుతుండగా శుక్రవారం విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగింది. ఉదయం మహా గణపతి హోమం, గోమాతపూజ, కుంభాబిషేకాలు జరిగాయి. స్వామివారి ప్రాణప్రతిష్ఠ అనంతరం, ఆభరణాల ఊరేగింపు జరిగింది. వివిధ గ్రామాల భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో గురుస్వాములు ఉన్నికృష్ణన్ నంబూద్రి, రాజు, ఎర్రోజు గోపాల్‌చారి, బిల్ల రఘు, ఈదుల రవీందర్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డి, ముంజ భూపతి, కట్ట ఎల్లారెడ్డి, తూముకుంట మోహన్‌రెడ్డి, బాలరాజు, చారి, ఎర్రోజు సత్యం, ఆంజనేయులు, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణ, నిరంజన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే ఆలయాల అభివృద్ధి..

- మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ

ప్రజల భాగస్వామ్యంతోనే ఆలయాలు అభివృద్ధి చెందుతాయని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన అయ్యప్పస్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అయ్యప్పస్వామి కృపతో పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నారు. వ్యయప్రయాసలకు ఓర్చి కార్యక్రమాలను పూర్తిచేసిన నిర్వాహకులను అభినందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను అయ్యప్ప మాలధారులు సత్కరించారు. అనంతరం గొల్లపల్లె గ్రామంలో ఫంక్షన్‌హాల్‌కు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, నాయకులు పసుల వెంకటి, అంతగిరి వినయ్‌కుమార్, ఆనందరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఉప్పల అమరేందర్, మామిడి రాజు, చిట్టి ప్రదీప్‌రెడ్డి, బాలపోచయ్య, నరేందర్‌రెడ్డి, మంద పెద్ద బాల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రమేష్, భాగ్యలక్ష్మి, పుష్పలత, శ్రీలత, సత్యారెడ్డి, జ్యోతి, రాజేశం, జమాల్, లింగం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బోరుబావి గుంత పూడ్చివేత.. తొలగిన ప్రమాదం..

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



బోరుబావి గుంతను పూడ్చివేయిస్తున్న ప్రవీణ్‌కుమార్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ పరిధిలోని మొదటి బైపాస్‌రోడు మూలమలుపు వద్ద ప్రమాదకరంగా మారిన బోరుబావి గుంత పైకప్పు వేయించారు. ఈనెల7న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన ప్రమాదకరంగా బోరు బావి గుంత' కథనానికి పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం స్పందించారు. క్షేత్రస్థాయిలో బోరు బావి గుంతను పరిశీలించారు. పంచాయతీ సిబ్బందితో బోరు బావి గుంతపై కప్పు వేయించి ప్రమాదాన్ని తొలగించారు. బోరు బావి గుంత పైకప్పు పనులు చేయడంతో కాలనీవాసులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు.

పైప్‌లైన్ లీకేజీ.. కలుషితమవుతున్న నీరు..



పైప్‌లైన్ లీకేజీతో నిలిచిన నీరు

వీర్నపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో మంచినీటి ట్యాంకు వెళ్లే పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు కలుషితమవుతోంది. గత కొన్ని రోజులుగా పైప్ లైన్ పగిలి నీరు నిలిచిపోయి మురికిగా తయారైనా పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్థులు వాపోతున్నారు. నిలిచిన నీరు మంచినీటి ట్యాంకులోకి చేరుతోందని పేర్కొన్నారు. గతంలో తాగునీరు కలుషితమై గ్రామస్థులు జ్వరాలతో మంచం పట్టినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి తాగునీరు కలుషితం కాకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉపాధి కార్మికుల బకాయిలు విడుదల చేయాలి

- మూడు నెలలుగా కార్మికుల అవస్థలు - సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా ఉపాధిహామీ కార్మికుల బకాయిలు రూ.6వేల కోట్లను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే విడదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో వేణు మాట్లాడారు. ఉపాధిహామీ పథకంలో దాదాపు లక్ష మంది కార్మికులు పని చేస్తున్నారని గత మూడు నెలలు నుంచి బకాయిలు చెల్లించడం లేదని అన్నారు. ఉపాధిహామీపై ఆధారపడి లక్షలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతుండగా, కేంద్ర ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఉపాధిహామీ కార్మికులకు చెల్లించాల్సిన రూ.6వేల కోట్లు బకాయిలను ఉద్దేశపూర్వకంగా కేంద్ర ప్రభుత్వం విడదల చేయడం లేదని అన్నారు. వామపక్షాల ఆధ్వర్యంలో పురుడు పోసుకున్న ఉపాధిహామీని దెబ్బతీయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సీజన్లో ఉపాధిహామీని నమ్ముకునే కార్మికులు పని చేస్తున్నారని, 15 రోజుల లోపు బకాయిలు చెల్లించాల్సి ఉండగా, నెలలు తరబడి కూలీ డబ్బులు పెండింగ్‌లో ఉండడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్న జరిగిన పార్లమెంట్ సమావేశంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధిహామీకి కేవలం రూ. 80వేల కోట్లు మాత్రమే కేటాయించి ఉపాధిహామీ కార్మికులకు కేంద్రం అన్యాయం చేసిందని ఆరోపించారు. పూర్తి స్థాయిలో ఉపాధిహామీ పని కార్మికులకు ఉపాధి కల్పించాలంటే దాదాపు రూ.2లక్షల కోట్లు అవసరమన్నారు. ఉపాధిహామీ గైడ్‌లైన్స్‌ను బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా రూ.6వేల కోట్ల బకాయిలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే విడదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉపాధిహామీ కార్మికులు వేసవిలో ఎండ తీవ్రతను తట్టుకొనే విధంగా అన్ని మౌళిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు, జిల్లా నాయకుడు కిషోర్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసుల దాడులు

వీర్నపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిపదిర, గర్జనపల్లి, శాంతినగర్, వన్‌పల్లి గ్రామాల్లో ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. 400లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేసి, 10లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. సారాఅమ్ముతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి, అనుమానితులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

రైస్‌మిల్‌కు అనుమతి ఇవ్వొద్దు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట గ్రామశివారులో రుద్రశివ రా రైస్‌మిల్లులో మరో పారాబాయిల్డ్ రైస్‌మిల్లుకు అనుమతులు ఇవ్వద్దని రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం రైస్‌మిల్లు పరిశీలనకు వచ్చిన డీసీఎస్‌వో వసంతలక్ష్మి, తహసీలార్ రామచంద్రం ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు..





మహాకాళి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్, మృత్యుంజయం, కేకే

గంభీరావుపేట ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో స్థానిక రెడ్డి సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న మహాకాళి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో శుక్రవారం ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాలు బుధవారం ప్రారంభంకాగా, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానిక రెడ్డి సేవా సంక్షేమ సంఘం నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా శ్రీ భక్త మార్కండేయ ఆలయ వార్షికోత్సవం

మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శ్రీభక్త మార్కండేయ దేవాలయం వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివ పంచాయన పూజ రుద్రాభిషేకం శ్రీ రాజ రాజేశ్వరి దేవి, శ్రీ సాయిబాబా, శ్రీ ఆంజనేయ స్వామి, నవగ్రహ అభిషేకాలను నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, పలువురు నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.

జీపీఎఫ్ అకౌంట్లను బదిలీ చేయాలి..


- టీఆర్‌టీఎఫ్ నాయకుల వినతి



డిప్యూటీ సీఈవోకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి ఇతర జిల్లాకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల జీపీఎఫ్ అకౌంట్లను ఆ జిల్లాలకు బదిలీ చేయాలని అదే విధంగా ఇతర జిల్లాల నుంచి మన జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయుల అకౌంట్లను మన జిల్లాకు వచ్చే విధంగా కృషి చేయాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో మచ్చ గీతను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా పార్ట్ ఫైనల్ బిల్లుల కోసం ఉపాధ్యాయులు అవసర నిమిత్తం దరఖాస్తు చేసుకున్న వారికి జీపీఎఫ్ ఖాతాల నుంచి డబ్బులు విడుదల కాక ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయాన్నిపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి జీపీఎఫ్ పర్సనల్ బిల్లులను, రుణాల బిల్లులు రిటైర్‌మెంట్ ఫైనల్ బిల్లులు త్వరగా విడుదల అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ గోలి రాధాకృష్ణ, సిరిసిల్ల మండల అధ్యక్షుడు పోతుగంటి రమేష్, ఇల్లంతకుంట మండల ఉపాధ్యాక్షుడు జడల రాములు, అనిల్ పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి



వివరాలు తెలుసుకుంటున్న చైర్మన్ నారాయణ

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ నారాయణ సూచించారు. మండల కేంద్రంలోని వైశ్యభవనంలో శుక్రవారం విద్యుత్ సమస్యల పరిష్కారవేదిక సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల విద్యుత్ సమస్యల పరిష్కారం సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో సమస్యలు ఏర్పడినప్పుడు అధికారుల దృష్టికి తీసుకరావాలని సూచించారు. ఈసందర్భంగా 15 ఫిర్యాదులు రాగా వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో టెక్నికల్ సభ్యుడు రామకృష్ణ, ఫైనాన్స్ సభ్యుడు కిషన్, ఇండిపెండెంట్ సభ్యుడు రాజాగౌడ్, డీఈ రామసుబ్బారెడ్డి, ఏఈలు నగేష్, మధుకర్, అరవిందాచారిలతో పాటు సెస్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు కృషి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులి పురుగుల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ సరియా అంజూమ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో నులి పురుగుల నివారణపై వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 10వ తేదిన ఏడాది నుంచి 19 ఏళ్ల వయసు గల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ ద్వారా నులిపురుగులను నివారించవచ్చన్నారు. ఈ మాత్రలను ఆహారం తీసుకున్న తర్వాతనే వేసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ రజని, సూపర్‌వైజర్లు పద్మ, పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

గంభీరావుపేటలో పోచమ్మ బోనాలు..



బోనాలతో తరలివెళుతున్న భక్తులు

గంభీరావుపేట ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో స్థానిక రెడ్డి సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న మహాకాళి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి పోచమ్మ బోనాల తీశారు. పోచమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా మహిళలు బోనాలను తీసుకెళ్లి సమర్పించారు. ప్రధాన రహదారి, సీతారాం బజార్, పోలీస్ స్టేషన్ వీధి వెంట పోచమ్మ బోనాల ఊరేగింపు కొనసాగింది. పెద్ద ఎత్తున రెడ్డి సేవా సంక్షేమ సంఘం నాయకులు, సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నుంచి రక్షణ కల్పించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న బాధితులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కటుకం మృత్యుంజయంతో తమకు ప్రాణహాని ఉందని, తమకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పిచాలని బాధితులు సిరిసిల్లలో ఆందోళన చేపట్టారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో బాధితులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బాధితులు భోజన్నగారి శంకర్, కొప్పు అమృత, మారవేణి దేవలక్ష్మీ, ఐత సంతోష్, మాహబూబ్, మిట్టపల్లి ఆంజనేయులు, రాజు, చిట్టిపల్లి నాంపెల్లి, మేకర్తి మల్లేశం, మిట్టపెల్లి బాలరాజులు మాట్లాడుతూ గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు కటుకం మృత్యుంజయం తమలాంటి పేదల భూములను కబ్జాచేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూళ్లు చేసి అమాయకులను మోసం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బాధితులు రంజిత్‌కుమార్, దేవలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.